## మినీ కథ

# పెళ్ళాం మాట

### ఎస్. అగ్బల్

"ఏమండీ, వాడి విషయం మీకు పట్టనట్టే వుంటారేం?" చాటలో బియ్యం యేరుతున్న శాంత గొంతులో విషాదం వినిపించింది.

రామ్మూర్తిలో ఏ మాత్రం చలనం కన్పించలేదు. యధావిధంగా పేపర్ చదువుతూ కూర్చున్నాడు.

"పాతికేళ్లు కళ్ళలో పెట్టుకు పెంచి పెద్ద చేసిన అమ్మా నాన్నా పోయారు. నిన్నకాక మొన్న వచ్చిన పెళ్ళాం ఎక్కువయిపోయింది!" శాంత చెమ్మగిల్లిన కళ్ళు చీర కొంగుతో తుడుచుకుంది.

"శాంతా!" రామ్మూర్తి మ్మాట వినగానే శాంత ముఖంలో వెలుగు కన్పించింది.

"ఎన్. టి. ఆర్‌తో మంచి సిన్మా తీస్తున్నారు...."ఇంకా యేదో చెప్పబోతుండగానే శాంత నీరసంగ పక్కకు తప్పుకొంది. వంట గదిలో భూకంపం వచ్చినట్టు పాత్రలన్నీ క్రింద పడ్డాయి.

"చూశారు కదా, దాని పొగరు!" శాంత రామ్మూర్తికి విన్నవించుకుంది.

"పొగరంటారేమిటి చెయ్యి జారింది!" లోపలినుంచి కోడలు గొంతు వినిపించింది.

గేటువరకు వచ్చి విసుగ్గా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు రామ్మూర్తి కొడుకు శేఖరం. రామ్మూర్తికి ఇవేమీ పట్టనట్లు మళ్ళీ పేపర్‌లో తల దాచుకున్నాడు.

లోన అత్తా కోడళ్ల మధ్య యుద్ధం జరుగుతుందని రామ్మూర్తికి తెలుసు. అది కోడలు ఈ గుమ్మం తొక్కిన మరుక్షణం నుంచే ప్రారంభమయింది.

"ఏమండీ విన్నారా? ఎంతేసి మాటలంటోందో!" శాంత ఏడుస్తూ రామ్మూర్తి దగ్గర కొచ్చింది.

రామ్మూర్తి పక్కనున్న చుట్టపీక నోట్లో పెట్టుకొని "శాంతా! కాస్త ఆ అగ్గిపెట్టి ఇలా పారెయ్యి!" అన్నాడు.

శాంత ఓ అడుగు ముందుకేసి ఆగి "అంతా నా ఖర్మ మీకే విషయాలు పట్టవు. వాడు చూస్తే విని ఊరుకుంటాడు...." అంటుండగా

"ఊరుకోపోతే ఉరేసుకోమంటారా?" కోడలు అడ్డుతగిలింది.

శాంత రామ్మూర్తికి అగ్గిపెట్టె అందిస్తూ "అంతా ఆ శేఖరంగాడిలో వుంది.మన బంగారం మంచిది కానప్పుడు...."

అత్తామామల మాటలు వినిపించకుండా రేడియో సౌండ్ పెద్దగా పెట్టి కూర్చుంది కోడలు.

"పెళ్ళాం మాట విన్నవాడు గాడిదతో సమానమంటి. అది ఎలా చెబితే అలా ఆడితే వాడికీ గాడిదకీ తేడా ఏమిటి?" శాంత ఇంకా గొణుగుతూనే వుంది.

"ఇంతకీ ఏం చెయ్యమంటావు?" రామ్మూర్తి విసుగ్గా అన్నాడు.

"నా మాట విని...."

శాంత మాటకు అడ్డుతగిలి "నన్ను గాడిదని కమ్మంటావు" అన్నాడు రామ్మూర్తి.

"అలా అంటారేమిటండీ?"

"ఇప్పుడే అన్నావు కదా పెళ్ళాం మాట విన్నవాడు గాడిదని."

రామ్మూర్తి మాటలకు శాంత ముఖం చిన్నబోయింది. □

# కొండంత దీపం

### పి. యస్. నారాయణ

వ్యాపారరీత్యా హైద్రాబాద్‌లో వారంరోజుల పని తగిలింది రామానికి. అటు యిటు తిరగాలి. బస్సులు టైంకు దొరకవు. ఆటోలంటే ఖర్చు యెక్కువ. అందుకే స్కూటరు తీసుకుని వెళితే హాయిగా వుంటుందనిపించి నల్లగొండ నించి ఉదయం ఎనిమిది గంటలకల్లా—బ్రీఫ్‌కేస్‌లో రెండుజతల గుడ్డలు పెట్టుకొని బయల్దేరాడు స్కూటర్ మీద రామం.

వాతావరణం చల్లగా వున్నది. ఆకాశానికి పట్టిన మబ్బులు సూర్యుణ్ణి కనబడనీయటం లేదు—ఎక్కడా ఆగకుండా వెళితే మూడు గంటల ప్రయాణం.

ఎలాగూ రామం పెద్దన్నయ్య హైద్రాబాద్‌లోనే వున్నాడు. అక్కడ వుండవచ్చు.... వదిన యెప్పుడూ అంటూ వుంటుంది—శారదను తీసుకురాగూడదా అని....శారద బయలేరే....పిల్లలకు పరీక్షలవ్వటంతో యింట్లో వుండక తప్పలేదు....

ఇరవై నిముషాల్లోనే నార్కెట్‌పల్లికి వచ్చాడు రామం. అసలే చల్లటి వాతావరణం. ఆపైన రోడ్డు పక్కగా గుబురుగా పెరిగిన చింతచెట్లు.

నార్కెట్‌పల్లిలో ఆగి ఒక కప్పు చా త్రాగి రామ్‌ప్యారీ వేసుకొని ఫోర్ స్క్వేర్ ముట్టించి మళ్ళా స్కూటర్ ఎక్కాడు రామం. సీటు క్రిందగా బ్రీఫ్‌కేస్ వేలాడుతుంది-వెనుక శారద కూర్చుని కబుర్లు చెబుతుంటే—నడుం మీద చేయివేసి మరీ—యెంత బాగుండేది!

ఆలోచనలు భార్య శారద చుట్టూ తిరుగుతున్నాయి. రామం స్కూటర్‌ని విశాలమైన రోడ్డుమీద వేగంగా పోనిస్తున్నాడు. పైన మబ్బులు ఎవ్వరికీ అందగూడదన్నట్లుగా పరుగెడుతున్నాయి. రోడ్డుపక్కన రాళ్ళ గుట్టలు....పలచబడ్డ చెట్ల గుబుర్లు....

పడమటి గాలి ఈదురోమంటోంది. వాన వస్తే....గాలి మరింత ఎక్కువయితే తుఫానుగా మారితే....

రావటానికి వీల్లేదు....తెల్లటి మబ్బులు వానకు సూచన గాకపోవచ్చు....వీస్తున్న గాలి మబ్బుల్ని తరిమివేయవచ్చు....ఏదైనా ఇంకా రెండు—మూడు గంటలు తనవి కావు అనుకుంటే తను హైద్రాబాద్‌లో వుండిపోతాడు.

శారదను తీసుకురానందుకు వదిన విసుక్కుంటుంది.

కొండలాంటి గుట్ట... స్కూటరు ఎత్తు మీదకు ఎక్కుతుంది....కొండ మలుపు తిరిగితే పల్లం....ఆపైన ఓ గ్రామంగూడా వుండాలి. అక్కడ....బాగా ఎత్తుకు వచ్చేసింది స్కూటరు. మలుపు తిరిగింది.

ఓ ఆర్టీసీ సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సు రోడ్డు పక్కగా ఆగివున్నది. దాని పక్కన ప్రయాణీకులంతా దిగి నిల్చొని వున్నారు.

యాక్సిడెంటా? .... ఈ మధ్య యాక్సిడెంట్స్ ఎక్కువవుతున్నాయి....

గేదె చచ్చిందో....మనిషి చచ్చాడో.... డ్రైవర్ ఉద్యోగమంత ప్రమాదకరమయిన ఉద్యోగం ఈ ప్రపంచంలో మరొకటి వుండదనిపించింది....అతడిది తప్పున్నా లేకపోయినా అతడంటే ఎవ్వరికీ జాలివుండదు....

బస్సు దగ్గరకు వచ్చి స్లో చేశాడు రామం! జనం దిగాలుబడి నిల్చొని వున్నారు.

"ఏమైంది?"

ఒక కుర్రవాడు నవ్వాడు...."మా అదృష్టం. దేనికీ పెట్టకముందే బ్రేకులు ఫెయిలయినయ్యని ఆపేశాడు డ్రయివర్ బాబూ!" అన్నాడు.

పక్కకుతిప్పి ముందుకు వచ్చాడు రామం.

"ఎక్స్‌క్యూజ్ మీ...." ఓ ఆడగొంతు. కాలు